

# హమ్‌న హలాల్ తుమ్‌న హరామ్

## మేము తినదగ్గది మీరు తినకూడనిది

ఇద్దరు ఆడపిల్లలు ఉన్న ఒక యింట్లో పేదరికం తాండవిస్తా ఉంది.

ఒకపూట తినక, ఒకపూట తిని ఆ ఆడపిల్లలు, ఆ పిల్లల తల్లిదండ్రులు ఎలాగో ప్రాణాలు నిలబెట్టుకొని వస్తా ఉన్నారు.

కొన్నాళ్ల తర్వాత అట్లా ఒక్కపూట తినే భాగ్యం కూడా పోయింది. రెండు రోజులు పస్తు వుండేసరికి ఆడపిల్లల ప్రాణాలు లాగతా ఉన్నాయి.

మూడోరోజు వాళ్లల్లో ఒకమ్మాయి తినడానికి ఏదో ఒకటి దొరకకపోదా అని ఆ చెట్లవైపు, ఈ దిబ్బల వైపు వెతుకుతూ తిరిగింది. కొంతసేపు తిరిగాక ఒకచోట ఆమెకు చచ్చి పడున్న ఒక పావురాయి కనిపించింది. ఈ పూటకి యిదే పదివేలు అనుకొని, ఆ పావురాయిని దావనీ (పవిట)లో భద్రంగా చుట్టుకొని యింటికి చేరింది.

కూతురు తెచ్చిన పావురాయిని చూసి కళ్లనీళ్లు పెట్టుకుంది తల్లి.

ఎంత ఆకలితో ఉంటే ఈ పిల్ల ఈ పని చేసి వుంటుందోగదా అనుకొని, పావురాయిని శుభ్రం చేసి, కాసింత ఉప్పుగల్లు వేసి పొయ్యి మీద పడేసింది.

కాసేపటికి ఆ కూర దబరలో నుంచి యిలాంటి సువాసన వస్తోందంట యిలాంటి సువాసన వస్తోందంట చుట్టుపక్కల ఇళ్లకు కూడా ఆ వాసన గమగమమని సోకిందంట.

వీళ్లున్న యింటి పక్కనే బాగా డబ్బున్న ఒక వర్తకుడి యిల్లు ఉంది.

ఆ యిల్లుగల్లామెకు కూడా ఆ వాసన సోకింది.

ఎప్పుడూ లేనిది వీళ్ల యింటి నుంచి యింత మంచి కూర వాసన వస్తోందేమిటా అనుకుని 'ఏమ్మా? ఏం కూర?' అని అడిగిందామె.

చనిపోయిన పావురాయిని వండుకుని తింటున్నామని చెప్పే గతిలేనితనాన్ని బయటపెట్టుకోవడం ఎందుకుని 'హమ్‌న హలాల్ - తుమ్‌న హరామ్' అంది ఆ ఆడపిల్ల తల్లి.

అంటే 'మేము తినదగ్గది. మీరు తినకూడనిది' అని భావం.



ఆ జవాబుకి వర్తకుడి భార్యకు కోపం వచ్చింది. వాళ్ల తినదగ్గ కూర మేము తినకూడని కూర ఏమై వుంటుంది? ఈ పక్కింటి వాళ్లు ఏదో అవమానం చేయడానికే యిలాంటి మాట అనుంటారు అనుకుని భర్తకు కబురు పంపించింది.

ఆ టైంకు ఆ వర్తకుడు 'హజ్' (మక్కాయాత్ర) కోసం దాచుకున్న డబ్బుని లెక్కపెట్టుకుంటూ ఉన్నాడు.

ఆ డబ్బుతో అతడు ఆ రోజో, ఆ మర్నాడో హజ్‌కు బయలుదేరాలి.

ఈ తగాదా విని 'ఏమిటి సంగతి' అని అడిగాడు యింటికి వచ్చి.

'చూడండి ఆ పక్కింటి వాళ్లకు ఎంత పొగరుగా ఉందో. ఏం కూర అని అడిగితే మేము తినదగ్గది మీరు తినకూడనిది అని జవాబు చెప్పారు. దీని సంగతేందో కనుక్కోండి' అన్నదామె.

వర్తకుడు ఆ ఆడపిల్లల తండ్రిని పిలిచాడు.

‘ఏంటయ్యా ఈ గొడవ?’ అని అడిగాడు.

‘అయ్యా. మరేం లేదు. ఎవడైనా ఏ మాంసాన్నయినా బతికుండగానే జుబా (బిస్మిల్లా) చేసి తినాలి. చనిపోయినవాటిని తినకూడదు. అది మన మతరీతి. కానీ ఆకలితో అల్లాడిపోయే పేదవాళ్లకు ఈ రీతులూ రివాజ్‌లూ లెక్కలోకి వస్తాయా? రెండునాళ్లుగా యింట్లో తినడానికి ఏమీ లేకపోతే నా కూతురు చనిపోయిన పావురాయిని తెచ్చి వంట చేస్తూ వుంది. అట్లాంటి కూర మాబోటి వాళ్లు తినదగ్గదే అయినా మీబోటి వాళ్లు తినకూడనిది కదా. అందుకనే నా భార్య అలా చెప్పింది’ అన్నాడు.

ఆ సంగతి విని వర్తకుడికి ఏడుపు వచ్చింది.

ఎక్కడో ఏడు సముద్రాల అవతల ఉన్న మక్కాను చూడాలనుకుంటున్నాను గానీ ఏడడుగుల దూరంలో వున్న పొరుగువారి కష్టసుఖాలు చూడలేకపోతున్నాను గదా. ఇవి చూడనప్పుడు అది చూసి ఫలితమేమి? అనుకొని అప్పటికప్పుడు తన హజ్ డబ్బులన్నీ ఆ పేదవాళ్లకు యిచ్చి - యికమీదట మీ కష్టనష్టాలు నేను పంచుకుంటాను అని మాట యిచ్చాడు. తన హజ్ యాత్ర మానుకున్నాడు.

అతడితోపాటు హజ్‌కు వెళ్లాల్సిన యితర వర్తకులు హజ్‌కు వెళ్లి నమాజ్‌లో నిలుచున్నారు.

కానీ వాళ్ల కళ్లకు ముందు వరుసలో నిలుచుని నమాజ్ చదువుతున్న ఈ వర్తకుడు కనిపించాడు.

వాళ్లు ఆశ్చర్యపోయి ఊరికి తిరిగి వచ్చి, ‘ఏమయ్యా పెద్దమనిషి. మాతో హజ్‌కు రానని చెప్పి మాకన్నా ముందువరసలో నమాజ్ చేస్తూ కనిపించావే’ అని అడిగారు.

వర్తకుడు ఆశ్చర్యపోయి జరిగింది చెప్పాడు.

పొరుగువారికి సాయపడటం కన్నా అంతిమ పరమార్థం మరొకటి లేదనీ, అందుకనే అతడు హజ్‌కు వెళ్లకపోయినా వెళ్లినంత పుణ్యం దక్కిందనీ వాళ్లు గ్రహించి లెంపలు వేసుకున్నారు.